జాలీగా హోలీ

మహేశ్వరం నియోజకవర్గంలోని గ్రామాలు, పలు కాలనీలు, బస్తీల్లో హోలీ సంబరాలు అంబరాన్నంటాయి. పెద్దలు, చిన్నారులు ఉత్సాహంగా హోలీ ఆడారు. యువత రోడ్లపైకి వచ్చి, ఒకరిపై ఒకరు రంగులు చల్లుకుంటూ సందడి చేశారు. ఆదివారం రాత్రి నుంచే కాముని దహనం చేసి హోలీ సంబరాలు ప్రారంభించారు. పట్టణాల్లోని వీధులన్నీ రంగులమయంగా మారాయి. –సాక్షి, నెట్‌వర్క్



మీర్‌పేట: సిద్ధార్థ్‌హిల్స్‌లో సరదాగా చిన్నారులు



జల్‌పల్లి గ్రామంలో డప్పు చప్పుల నడుమ రంగుల పండుగ



పహాడీషరీఫ్: పిల్లలగూడెంలో రంగులద్దుకుంటున్న మహిళలు



తుక్కుగూడ: హోలీ ఆడుతున్న బాలికలు



పహాడీషరీఫ్: అమ్మవారు ఆవహించిన పూజారిని మొక్కుతున్న భక్తులు



మహేశ్వరం: రావిర్యాలలో హోలీ వేడుకల్లో చిన్నారులు



మహేశ్వరం: కందుకూరు చౌరస్తాలో..



మహేశ్వరం: సాయిరెడ్డిగూడలో గ్రామస్తుల హంగామా



మానసిక దివ్యాంగుల మధ్య హోలీ సంబురాలు జరుపుకొంటున్న ఆశ్రమ నిర్వాహకులు గిరి



మీర్‌పేట: హోలీ సంబరాల్లో మీర్‌పేట కార్పొరేషన్ మున్సిపల్ సిబ్బంది

క్లుప్తంగా

ముగిసిన తిరుకల్యాణ ఉత్సవాలు

తుక్కుగూడ: మున్సిపాలిటీ పరిధిలోని శ్రీనగర్ (ఈసీటీ) ఆదిలక్ష్మి అలివేలు మంగా సమేత బాలాజీ వేంకటేశ్వర స్వామి తిరుకల్యాణ మహోత్సవాలు సోమవారం ముగిశాయి. చివరి రోజున స్వామివారు గుట్ట మీది నుంచి మంఖాల్ ఆలయానికి చేర్చారు. ఈ కల్యాణోత్సవాల్లో భాగంగా నాలుగు రోజుల పాటు, మంఖాల్ నుంచి స్వామివారిని గుట్టపై తీసుకురావడం కల్యాణం, ఎదుర్కోలు, రథోత్సవం తదితర కార్యక్రమాలు నిర్వహించారు. ఉత్సవాలను విజయవంతం చేసినందుకు బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి తూళ్ల వీరేందర్‌గౌడ్ భక్తులకు, పోలీసు, మున్సిపల్ సిబ్బందికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. కార్యక్రమంలో ఆలయ వంశపార్య ధర్మకర్తలు శేషం జగన్నాథచార్యులు, సింహచార్యులు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

ఎస్సీ సెల్ అధ్యక్షుడిగా రాజు



నియామకపత్రం అందుకుంటున్న రాజు

తుక్కుగూడ: తుక్కుగూడ మున్సిపాలిటీ ఎస్సీ సెల్ అధ్యక్షుడిగా మున్సిపాలిటీ పరిధిలోని మంఖాల్ గ్రామానికి చెందిన కప్పల రాజును నియమిస్తూ సోమవారం జిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షుడు బెర్రీ రాజ్‌కుమార్ నియామక పత్రం అందజేశారు. ఈ సందర్భంగా రాజు మాట్లాడుతూ.. తన నియామకం కోసం సహకరించిన ప్రతి ఒక్కరికి కృతజ్ఞతలు తెలియజేశారు.

ముగిసిన బ్రహ్మోత్సవాలు

హస్తినాపురం: హస్తినాపురం డివిజన్ పరిధిలోని కర్మన్‌ఘాట్‌లోని హరిహరక్షేత్ర అయ్యప్ప దేవాలయం 13వ వార్షిక బ్రహ్మోత్సవాలు ఆదివారం రాత్రి అయ్యప్ప స్వామి పడిపూజలు ముగిశాయి. ఆలయ కమిటీ వ్యవస్థాపక చైర్మన్ వంగా మధుసూదన్‌రెడ్డి ఆధ్వర్యంలో వేడుకలు ఐదురోజుల పాటు వైభవంగా నిర్వహించారు. చివరిరోజు ఆదివారం రోజు రాత్రి పదునెట్టాంబడి మహాపడి పూజను అంగరంగ వైభవంగా నిర్వహించారు. కార్యక్రమంలో బీజేపి నేతలు డీకే అరుణ, ఈటెల రాజేందర్‌లు పాల్గొని పూజలు చేశారు. ఆలయకమిటీ చైర్మన్ వంగా చంద్రారెడ్డి, ప్రధాన కార్యర్శి గడ్డం మంగారెడ్డి, డైరక్టర్లు మల్లికార్జునగుప్తా, లంకల రమేశ్‌రెడ్డి పాల్గొన్నారు.

రైతుబజార్లలో కూరగాయల ధరలు

దిల్‌సుఖ్‌నగర్: సరూర్‌నగర్, వనస్థలిపురం రైతుబజార్‌లలో కూరగాయల ధరలు (కిలో...రూపాయల్లో...) టమోటా లోకల్ 11, వంకాయ 18, బెండ 45, పచ్చిమిర్చి 45, కాకర 45, బీర 35, క్యాలీఫ్లవర్ 18, క్యాబేజీ 19, క్యారెట్ 19. దొండ 28, ఆలు 25, ఉల్లి 19, గోకర 35, దోస 18, సొర 9, పొట్ల 13, అరటి 09, చిక్కుడు 50, అర్వి 35, మునగ 28, చిలగడదుంప 60, బీట్‌రూట్ 19, కీర 23, ఫ్రెంచ్ బీన్స్ 50, కాప్సికమ్ 70. ఈ ధరలు మంగళవారం 9 గంటల వరకు మాత్రమే అమలులో ఉంటాయి.

వేంకటేశ్వరుడి సన్నిధిలో ఎమ్మెల్యే

తుర్కయంజాల్: పురపాలక సంఘం పరిధి కమ్మగూడలోని కల్యాణ వేంకటేశ్వర స్వామి ఆలయ బ్రహ్మోత్సవాల్లో సోమవారం ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి పాల్గొని స్వామివారిని దర్శించుకున్నారు. ఆలయ పండితులు ఆయనకు తీర్థ ప్రసాదాలు అందజేసి సన్మానించారు. కౌన్సిలర్ సునీల్, కొత్తకుర్మ మంగమ్మ, నాయకులు.. శివకుమార్, గోపాల్, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

హస్తం వైపు కారు నేతలు

- మహేశ్వరంలో మారుతున్న రాజకీయ సమీకరణాలు
- ఇప్పటికే కాంగ్రెస్‌లో చేరిన జెడ్పీ చైర్‌పర్సన్ తీగల అనితారెడ్డి, మాజీ ఎమ్మెల్యే కృష్ణారెడ్డి
- పార్లమెంట్ ఎన్నికల తర్వాత భారీ చేరికలకు ప్లాన్
- వలసలను నియంత్రించేందుకు సబితారెడ్డి ప్రయత్నాలు
- బీఆర్ఎస్ నేతల చేరికలపై సీనియర్ నాయకుల గుస్సా



దీపాదాస్ మున్షి ఆధ్వర్యంలో కాంగ్రెస్‌లో చేరిన జెడ్పీ చైర్‌పర్సన్ తీగల అనితారెడ్డి, కృష్ణారెడ్డి (ఫైల్)



మహేశ్వరం: నియోజకవర్గంలో పొలిటికల్ సీన్ మారుతోంది. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన నేపథ్యంలో కారు పార్టీకి కొంత మంది లీడర్లు, మాజీ ప్రజాప్రతినిధులు గుడ్ బై చెప్పిహస్తం పార్టీలోకి చేరేందుకు సిద్ధమవుతుందన్నారు. అధికారంలో ఉన్న పార్టీలో చేరితే రాజకీయ భవిష్యత్తుతో పాటు, ప్రాధాన్యం, భవిష్యత్తులో నామినేటెడ్ పదవుల రేసులోనూ ఉండవచ్చని యోచిస్తున్నారు. అభివృద్ధి కోసమే అధికార పార్టీలోకి చేరుతున్నామనే నినాదంతో పార్టీ మారాలని బీఆర్ఎస్ నేతలు యోచిస్తున్నారు. కాంగ్రెస్ అధికారంలో ఉన్నా మహేశ్వరం నియోజకవర్గంలో బీఆర్ఎస్ ఎమ్మెల్యే సబితారెడ్డి గెలుపొందారు. బీఆర్ఎస్‌తో పాటు బీజేపీ, కాంగ్రెస్ పార్టీలు కూడా నియోజకవర్గంలో బలంగా ఉన్నాయి. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చినప్పటి నుంచి బీఆర్ఎస్‌లో కొంత మంది నేతలు కాంగ్రెస్‌లో చేరాలని నిర్ణయించుకొని బీఆర్ఎస్ పార్టీపై, నేతలపై అసంతృప్తి వ్యక్తం చేస్తూ పార్టీ కార్యక్రమాలకు దూరంగా ఉంటూ వస్తున్నారు.

కాంగ్రెస్‌లో చేరిన తీగల అనితారెడ్డి, కృష్ణారెడ్డి

ఇటీవల రంగారెడ్డి జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ తీగల అనితారెడ్డి, మాజీ ఎమ్మెల్యే తీగల కృష్ణారెడ్డితో పాటు కొంత మంది నేతలు రాష్ట్ర కాంగ్రెస్ వ్యవహారాల ఇన్‌చార్జి దీపాదాస్ మున్షి అధ్యక్షతన కాంగ్రెస్‌లో చేరారు. తీగల వెంట భారీ ఎత్తున నేతలు వెళ్తారని ఊహించిన ఆశించిన స్థాయిలో పెద్ద నేతలు వెళ్లలేదు. తాజాగా చేవెళ్ల ఎంపీ రంజిత్‌రెడ్డి బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్‌లో చేరడంతో నియోజకవర్గంలో భారీగా కాంగ్రెస్‌లో చేరేందుకు సిద్ధమవుతున్నారు. అంతకు ముందు మహేశ్వరం బీఆర్ఎస్ సీనియర్ నాయకులు, మహేశ్వరం మాజీ సర్పంచ్ కూన యాదయ్య, ఘట్టుపల్లి మాజీ సర్పంచ్ రాకేష్‌రెడ్డి, బీఆర్ఎస్ మండల ప్రధాన కార్యదర్శి పరిగి రాఘవేందర్‌రెడ్డి, నాయకులు కర్రోళ్ల చందు ముదిరాజ్, మురళీధర్‌రెడ్డి, రాములు, దోమ శ్రీనివాస్‌రెడ్డి, పరమేశ్, వెంకటేశ్‌గౌడ్‌లతో పాటు పలువురు బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్‌లో చేరారు. మీర్‌పేట్, బడంగ్‌పేట్, జల్‌పల్లి మున్సిపాలిటీల నుంచి పలువురు కార్పొరేటర్లు, మాజీ ప్రజాప్రతినిధులు కూడా చేరారు.

వలసల నియంత్రణకు సబితారెడ్డి ప్రయత్నాలు

రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ మెజార్టీ స్థానాలు గెలుపొంది అధికారంలోకి వచ్చిన, మహేశ్వరంలో మాత్రం బీఆర్ఎస్ ఎమ్మెల్యే సబితారెడ్డి గెలుపొందారు. బీఆర్ఎస్ నేతలను కాంగ్రెస్‌లో చేరకుండా బీఆర్ఎస్‌లోనే ఉండేలా నేతలను ఎమ్మెల్యే సబితారెడ్డి కొంత వరకు కట్టడి చేస్తున్న వలసలు ఆగడం లేదు. నియోజకవర్గంలో ఎమ్మెల్యే సబితారెడ్డి, ఆమె తనయుడు కార్తీక్‌రెడ్డిలు అప్రమత్తమై పార్టీ క్యాడర్‌ను కాపాడుకునేందుకు మండలాలు, డివిజన్లు, వార్డు, గ్రామస్థాయి నేతలతో నేరుగా మాట్లాడి కాంగ్రెస్‌లోకి నేతలెవరిని వెళ్లకుండా కొంత వరకు నియంత్రిస్తున్నారు. చాలా మంది బీఆర్ఎస్ నేతలు ఎమ్మెల్యే సబితారెడ్డిని కాదని కాంగ్రెస్‌లోకి వెళ్లలేకపోతున్నారు. కొంత మంది బీఆర్ఎస్ నేతలు సబితారెడ్డిని కాదని పార్టీ మారే ప్రసక్తి లేదని అంటున్నారు.

సీనియర్లు నాయకులు గుస్సా

ఎన్నికలకు ముందు కాంగ్రెస్ పార్టీలోకి రావాలని బీఆర్ఎస్ నేతలను పలుమార్లు అడిగితే రాలేదు కానీ, కాంగ్రెస్ అధికారంలోకి రాగానే సిద్ధాంతాలు పక్కనపెట్టి అధికార దాహం కోసం కాంగ్రెస్‌లో చేరుతున్నారని సీనియర్ కాంగ్రెస్ నేతలు సీరియస్ అవుతున్నారు. బీఆర్ఎస్ పార్టీలో ఉంటూ మమ్మల్ని ముప్పు తిప్పలు పెట్టి ,అక్రమ కేసులు బనాయించి, అధికారం ఉందనే అహంకారంతో వీర్రవిగిన నేతలు మళ్లీ కాంగ్రెస్‌లోకి వస్తే ఎట్లా అంగీకరిస్తామంటూ పాత కాంగ్రెస్ నేతలు అంటున్నారు. పార్టీ బలోపేతం కావాలంటే, త్వరలో జరిగే పార్లమెంట్, సర్పంచ్, ఎంపీటీసీ ఎన్నికల్లో మెజార్టీ స్థానాలు గెలవాలంటే చేరికలను ప్రోత్సహించక తప్పదని మరికొంత మంది కాంగ్రెస్ నేతలు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. ఏది ఏమైనా ఎంపీ ఎన్నికల అనంతరం నియోజకవర్గంలో బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్‌లోకి భారీగా చేరికలు ఉంటాయని ఆ పార్టీ నేతలు చెబుతున్నారు.

ఘనంగా ఆలయ వార్షికోత్సవం

నాగోలు: డివిజన్ పరిధిలోని బండ్లగూడలోని శ్రీ కంఠమహేశ్వర శివపంచాయతన వన మైసమ్మ దేవాలయం ప్రథమ వార్షికోత్సవం సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. బండ్లగూడ గ్రామస్తులు అమ్మవారికి బోనాలు సమర్పించారు. ఈ పూజ కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర టూరిజం డెవలప్‌మెంట్ కార్పొరేషన్ పూర్వ చైర్మన్ ఉప్పల శ్రీనివాస్ గుప్త పాల్గొని అమ్మావారిని దర్శించుకుని, ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో దేవాలయ అధ్యక్షుడు చెరుకు జంగయ్య గౌడ్, మెట్టు శంకరయ్య గౌడ్, ఉపాధ్యక్షుడు రుద్రగోని పాండు గౌడ్, లక్ష్మీబాయి గౌడ్, సుర్వీ ప్రమీల గౌడ్, చెరుకు బాలయ్య గౌడ్ పాల్గొన్నారు.

మలక్‌పేటలో 13.3 లీటర్ల మద్యం పట్టుకున్న పోలీసులు

మలక్‌పేట: అక్రమంగా మద్యం అమ్ముతున్న ఓ వ్యక్తిని మలక్‌పేట పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. అతని వద్ద 13.3 లీటర్ల మద్యం, నగదు, సెల్ స్వాధీనం చేసుకున్నారు. ఎస్సై నవీన్ తెలిపిన వివరాలు..యాదయ్య(50) అనే వ్యక్తి అక్బర్‌బాగ్ డివిజన్ ప్రొఫెసర్స్ కాలనీలోని ఓ అపార్ట్‌మెంట్‌లో వాచ్‌మెన్‌గా పని చేస్తున్నాడు. హోలీ పండుగ సందర్భంగా వైన్స్‌షాప్‌లు బంద్ పెట్టిన కారణంగా ముందుగా మద్యం కొని పెట్టుకున్నాడు. సోమవారం ఎక్కువ ధరకు మద్యం విక్రయిస్తుండగా విశ్వసనీయ సమాచారం మేరకు పోలీసులు అక్కడికి చేరుకుని సోదాలు నిర్వహించగా అతని వద్ద 13.3 లీటర్ల మద్యం (మెన్షన్ హౌజ్, ఐబీ, ఎంసీ, ఓసీ క్వాటర్ సీసాలు) దొరికింది. ఈమేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

విజయానికి ప్రతీక హోలీ

బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు శ్రీవర్ధన్‌రెడ్డి

షాద్‌నగర్: చెడుపై మంచి సాధించిన విజయానికి ప్రతీక హోలీ అని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు శ్రీవర్ధన్‌రెడ్డి అన్నారు. సోమవారం హోలీని బీజేపీ నేతలు ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. హిందూ సంస్కృతిలో హోలీకి ప్రత్యేకమైన స్థానం ఉందన్నారు. వసంత రుతువుకు ముందు హోలీ వస్తుందని, వాతావరణంలో మార్పులు వచ్చి చలికాలం నుంచి ఎండా కాలంలోకి మారుతుందన్నారు. రాబోవు లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీ గెలవడం ఖాయమన్నారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. ఎన్నికల తర్వాత మరో హోలీ జరుపుకుందామన్నారు. కార్యక్రమంలో అందె బాబయ్య, పాతపల్లి కృష్ణారెడ్డి, వంశీకృష్ణ, చెట్ల వెంకటేశ్, మల్చలం మురళీ, ప్యాట అశోక్, హరిభూషణ్ తదితరులు పాల్గొన్నారు.



హోలీ వేడుకల్లో శ్రీవర్ధన్‌రెడ్డి, నాయకులు

ఎవరికీ పట్టని సమావేశాలు!

- మొక్కుబడిగా హాజరవుతున్న అధికారులు
- సభలో చర్చించడంతోనే సరిపెడుతున్న వైనం
- పరిష్కారం కాని సమస్యలు

కొత్తూరు: గ్రామాల్లో నెలకొన్న సమస్యలు.. వాటి పరిష్కారం కోసం తీసుకోవాల్సిన చర్యలు.. నిధులు ఇతర అంశాలపై ప్రతీ మూడు నెలలకోమారు మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో మండల సర్వసభ్య సమావేశాన్ని నిర్వహిస్తున్నారు. అంతేకాకుండా గ్రామాల అభివృద్ధిలో భాగంగా ప్రభుత్వం అమలు చేస్తున్న ఆయా పథకాలపై సభలో చర్చ జరుగుతోంది. ఇక్కడ చర్చించిన అంశాలను అధికారులు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు క్షేత్రస్థాయిలో ప్రజలకు చేరవేయాలి. కాగా ఇంతటి ప్రాధాన్యత ఉన్న సభలకు చాలా మండలాల్లో కీలక శాఖల అధికారులు తమకు పట్టనట్లుగా వ్యవహరిస్తూ గైర్హాజరవుతున్నారు.

కీలక శాఖల అధికారులు గైర్హాజరు..

వాస్తవంగా మండల సర్వసభ్య సమావేశం ఎజెండాలో 29 అంశాలు ఉన్నాయి. ప్రతి శాఖకు సంబంధించిన ప్రగతి నివేదికను ఆ శాఖ మండలస్థాయి అధికారులు సభలో చదివి వినిపించాలి. అంతేకాకుండా సభలో ప్రజల పక్షాన సర్పంచ్‌లు, ఎంపీటీసీలు అడిగే ప్రశ్నలకు అధికారులు సమాధానం చెప్పాల్సి ఉంటుంది. మండలంలో నిర్వహిస్తున్న సమావేశానికి కాలుష్య నియంత్రణ, పరిశ్రమల శాఖ, ఆర్టీసీ, ఎక్సైజ్ పోలీసులు, అటవీశాఖ, హెచ్ఎండీఏ శాఖల అధికారులు వరుసగా గైర్హాజరవుతున్నారు. కాగా కొత్తూరు మండలంలో పరిశ్రమలు, రియల్ వెంచర్లు పెద్ద ఎత్తున వెలుస్తున్నాయి. కొన్ని పరిశ్రమల నుంచి ఆయా రకాల కాలుష్యం వెలువడుతుందని బాధిత గ్రామాల ప్రజాప్రతినిధులు సభ దృష్టికి తెస్తున్నారు. మరికొన్ని గ్రామాల్లో వెలుస్తున్న వెంచర్లలో పాటు కాల్వలను ధ్వంసం చేస్తున్నారు. కనీస నిబంధనలు పాటించడం లేదని సభకు విన్నవిస్తున్నారు. ఆయా గ్రామాల్లో కిరాణా దుకాణాలు, ఫాస్ట్‌ఫుడ్ సెంటర్లలో యథేచ్ఛగా బెల్టుషాపులు నిర్వహిస్తూ మద్యం విక్రయాలు చేస్తున్నారు. ఇలాంటి సమస్యలను ప్రజాప్రతినిధులు సభకు తెలుపుతున్న ఆయా శాఖల అధికారుల గైర్హాజరు కారణంగా సమస్యలు పరిష్కారానికి నోచుకోవడం లేదు. దీంతో ఆయా శాఖల సమస్యలపై సభలో చర్చిస్తున్న ఎలాంటి ఫలితం ఉండడం లేదని సర్పంచ్‌లు వాపోతున్నారు.

సమాచారం ఇస్తున్న పట్టని అధికారులు..

మండల సర్వసభ్య సమావేశానికి అన్ని శాఖల మండల స్థాయి అధికారులు హాజరు కావాలని ఎంపీడీవో కార్యాలయాలు సమాచారాన్ని ముందుగానే చేరవేస్తున్నాయి. కాగా కొన్ని శాఖల అధికారులు మొక్కుబడిగా హాజరవుతున్నారే తప్పా తమ శాఖల పూర్తి సమాచారాన్ని మాత్రం తేవడం లేదు. మరికొన్ని శాఖల అధికారులు సమాచారం అందిన హాజరుకావడం లేదు. ఇంకొన్ని శాఖల అధికారులు ఒక సమావేశానికి వస్తూ వరుసగా రెండు సమావేశాలకు హాజరుకావడం లేదు.



మండల సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్(ఫైల్)